సాక్షి
గుంటూరు
శనివారం, 31, మే, 2025



గుంటూరులో భారీ వర్షం

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వానకు నగరంలో రహదారులన్నీ జలమయం కావడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 512.40 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 5,598 క్యూసెక్కులు విడుదలవుతోంది.



ముడి వెండి సమర్పణ

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారికి తెనాలికి చెందిన కడియాల సుధీర్ కుటుంబం రూ. 3.50 లక్షలు విలువగల 3.6కేజీల ముడివెండిని సమర్పించింది.

న్యూస్‌రీల్

నేటి నుంచి రైల్వే గేటు మూసివేత



ఫిరంగిపురం: ఫిరంగిపురం నుంచి సత్తెనపల్లి వెళ్లే మార్గంలోని అల్లంవారిపాలెం వద్ద ఉన్న రైల్వేగేటు ఎల్‌సీ 298కి శనివారం నుంచి అత్యవసర మరమ్మతులు నిర్వహించనున్నట్లు రైల్వే శాఖ నల్లపాడు సీనియర్ సెక్షన్ ఇంజినీర్ పి. ఉమామహేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరమ్మతు పనుల్లో భాగంగా శనివారం నుంచి జూన్ మూడో తేదీ వరకు గేటు మూసివేస్తామన్నారు. ప్రత్యామ్నాయంగా ఆరోగ్యనగర్ వద్ద ఉన్న అండర్ పాస్‌ను వాహనదారులు వినియోగించుకోవాలని సూచించారు.

రైల్వే గడ్డర్‌ను ఢీకొన్న భారీ వాహనం



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం రైల్వే ట్రాక్ వద్ద ఏర్పాటుచేసిన రైల్వే గడ్డర్‌ను ఓ భారీ వాహనం ఢీకొట్టిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం రైల్వేట్రాక్ అండర్‌పాస్ వద్ద భారీ వాహనాల రాకపోకల నిషేధానికి ఏర్పాటు చేసిన రైల్వే గడ్డర్‌ను చూసుకోకుండా వాహన డ్రైవర్ ఢీకొట్టాడు. దీంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

వీసీ ఆచార్య కె.గంగాధరరావు



ఏఎన్‌యూ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని వీసీ ఆచార్య కె గంగాధరరావు అన్నారు. యోగాంధ్రలో భాగంగా శుక్రవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో అధికారులు, సిబ్బంది, పరిశోధకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం యూనివర్సిటీ యోగా సెంటర్‌లో యోగా సాధన చేశారు. వీసీ ఆచార్య కె గంగాధరరావు యోగా ఆవశ్యకతను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. యోగా ఆవశ్యకతను మనం గుర్తించడంతోపాటు, సమాజానికి అవగాహన కల్పించాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ప్రిన్సిపాల్స్ ఆచార్య పీఏస్ పాల్ కుమార్, ఆచార్య పి సిద్దయ్య, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ఏడాది పాలనలో అన్నదాత అన్నివిధాలా నష్టపోయాడు. విత్తేందుకు విత్తనాలు ఇవ్వక, చల్లేందుకు ఎరువులు లేక, అన్నింటికి మించి పెట్టుబడి సాయం అందక.. ఎన్నో ఇక్కట్లు పడి.. అందిన కాడికి అప్పులు చేసి.. ఎలాగోలా దేవుడిపై భారం వేసి.. సాగు రంగంలోకి దిగి ఆరుగాలం కష్టపడి.. పంటను కంటికి రెప్పలా కాపాడుకున్న రైతన్న నేడు పండిన పంటకు గిట్టుబాటు ధరలేక విలవిలలాడిపోతున్నాడు. లాభాల మాట దేవుడెరుగు.. పెట్టుబడి ఖర్చయినా వస్తుందనుకుంటే.. ధర లేక, ప్రభుత్వ ఆ'ధర'ణ లేక, కొనేవారు కానరాక.. నేడు కన్నీరే మిగిలింది. జిల్లాలో ఏ ఒక్క రైతును కదిలించినా తమ గుండె లోతుల్లోని బాధ కన్నీటి రూపంలో బయటకు వస్తుంది. పట్టించుకుని రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం గాలికొదిలేయగా.. మిల్లర్లు, కాంట్రాక్టర్లు, దళారులు కుమ్మక్కై ధాన్యం రైతును దగా చేయగా, మిర్చి రైతు కంట కన్నీరు తెప్పించారు. పత్తి, నల్లబర్లీ, అపరాల రైతులను రోడ్డున పడేశారు.



ఆధరణ లేక వేదన

గిట్టుబాటు ధరలేక అన్నదాత కంట కన్నీరు

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

- సంపద సృష్టి లేకపోగా ఉన్న సంపద ఆవిరి
- తీవ్ర నష్టాల్లో రైతాంగం
- నష్టాల ఊబిలో మిర్చి రైతు
- హామీ ఇచ్చినా ఆదుకోని కూటమి ప్రభుత్వం
- మిర్చి రైతులకు ఎకరానికి లక్షన్నర వరకు నష్టం
- వరి రైతుకు గిట్టుబాటు దక్కలేదు
- వర్షాలతో పంట తడిచిపోయి ఇబ్బందులు
- పత్తి, పొగాకు, కంది, పసుపునకు కూడా దక్కని గిట్టుబాటు
- ఏడాది పాలనలో నష్టపోయిన తీవ్రంగా నష్టపోయిన జిల్లా రైతులు



మిర్చికి మద్దతు ధర కల్పించాలని గుంటూరు మిర్చియార్డు వద్ద నిరసన తెలియజేస్తున్న రైతులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, గుంటూరు: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలకు సంపద సృష్టిస్తామని ఇచ్చిన హామీ అమలు కాకపోగా, ఉన్న సంపద హరించుకుపోయింది. గిట్టుబాటు ధర లేక, వ్యాపారులు ధరలు తగ్గించివేయడంతో రైతులు నష్టాల ఊబిలో చిక్కుకున్నారు. ఏ రైతును పలకరించినా కన్నీటి గాథలే తప్ప ఒక్క రైతు కూడా ఈ ఏడాది కాలంలో సంతోషంగా ఉన్న దాఖలాలు కనపడటం లేదు.

జిల్లా సాగు సమాచారం

సాగు విస్తీర్ణం	1,59,187 ఎకరాలు
రైతులు	1,30,000 మంది
కౌలు రైతులు	35000
రైతు సేవా కేంద్రాలు	249
కొనుగోలు కేంద్రాలు	154

మిర్చి రైతు కంట కన్నీరు

ఎర్ర బంగారంగా పిలిచే మిర్చిసాగుకు ఉమ్మడి గుంటూరు జిల్లా పెట్టింది పేరు. గుంటూరు మిర్చికి దేశ, విదేశాల్లోనూ మంచి డిమాండ్ ఉంది. కానీ ఈ ఏడాది ప్రారంభం నుంచి మిర్చి ధరలు క్రమంగా తగ్గిపోతుండడం ఆందోళనకరంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో లాభాలు కాదు కదా? కనీసం కూలి డబ్బులు కూడా రాకపోవడంతో కర్షకులు కన్నీటి పర్యంతం అయ్యారు. రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చింది. సొంతభూమి గల రైతులు లక్షన్నర వరకూ ఎకరానికి ఖర్చు చేయాల్సి వస్తే కౌలు రైతులు రూ.2లక్షల పైన ఖర్చు పెట్టారు. గతంతో పోల్చితే ఎరువులు, పురుగు మందులు ధరలు, కూలీల ఖర్చులు పెరగడం, మార్కెట్ కమిటీలకు సరుకును తీసుకురావడానికి బాడుగ, మిర్చి బస్తాల్లో నింపడానికి, తొక్కడానికి పెరిగిన ఖర్చులు కూడా రైతులకు భారంగా మారాయి. దీంతో మిర్చి సాగుకు పెట్టుబడులు అమాంతంగా పెరిగాయి. అయితే ధరలు మాత్రం గణనీయంగా పడిపోయాయి. దీనికి గత ఏడాది మిర్చి సరుకు కూడా భారీ స్థాయిలో శీతల గిడ్డంగులలో నిల్వలు ఉండటం కూడా ధరలు తగ్గిపోవడానికి ఒక కారణంగా వ్యాపారులు చెబుతున్నారు. అయితే ధరలు కావాలని తగ్గించారని రైతాంగం ఆరోపిస్తోంది. నిజంగా బయట మార్కెట్ బాగా లేకపోతే యార్డుకు రోజుకు లక్ష బస్తాల వరకూ వస్తే మొత్తం ఎలా కొంటున్నారని వారు ప్రశ్నిస్తున్నారు.

గతంలో మిర్చికి రికార్డు ధర

మరోవైపు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మిర్చియార్డుకు వచ్చి రైతులను పరామర్శించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం హడావిడి చేసింది. కేంద్రంతో మాట్లాడి రూ. 11,781 కంటే క్వింటాల్‌కు తక్కువ వస్తే ఆ మొత్తాన్ని భరిస్తామని ప్రకటించారు. అయితే ఇప్పటి వరకూ ఆ దిశగా అడుగులు పడలేదు. చేస్తానన్న సాయంపై మార్గదర్శకాలు రాలేదు. గత ప్రభుత్వంలో నాలుగేళ్లు మిర్చి రైతులకు రికార్డు స్థాయిలో ధరలు లభించాయి. సిజెంటా బాడిగ రకానికి రికార్డు స్థాయిలో రూ.36 వేల వరకు ధర పలికింది.

తీవ్రంగా నష్టపోయిన పత్తి, పొగాకు రైతులు

జొన్న, మొక్కజొన్న పంటలకు కూడా గిట్టుబాటు ధరలు రాలేదు. 2023–24లో క్వింటాలు రూ. 2700 కొనుగోలు చేస్తే 2024–25లో రూ. 1950లకు పడిపోయింది. కందులకు కూడా గిట్టుబాటు ధర లేదు. పత్తి రైతులు కూడా నష్టపోయారు. గుంటూరు జిల్లాలో 54,640 ఎకరాల్లో పత్తి పంట వేశారు. ఇది సాధారణ విస్తీర్ణం కన్నా తక్కువే. అయినా గిట్టుబాటు ధర మాత్రం దక్కలేదు. జిల్లాలో మొత్తం 15 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పత్తి క్వింటాలుకు మద్దతు ధర రూ. 7521 ప్రకటించినా దానికి కొన్ని షరతులు జోడించడంతో క్వింటాలుకు రూ.5వేల నుంచి రూ.6వేలు కూడా రైతులకు దక్కలేదు. నల్ల బర్లీ పొగాకు రైతులు కూడా కంపెనీలు కుమ్మక్కు అవ్వడంతో తీవ్రంగా నష్టపోయారు. గత ఏడాది రూ. 15 నుంచి రూ. 20 వేలు పలికింది. ఈ ఏడాది పంట చేతికి వచ్చే సమయానికి రూ.5వేలు నుంచి రూ.7వేలకు మాత్రమే కొంటామని కంపెనీలు చెబుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నాడు స్వర్ణయుగం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆర్‌బీకే సెంటర్‌లో రైతులకు ఎరువుల కొనుగోలు విషయంలో సాయం చేస్తున్న సిబ్బంది(ఫైల్)

గతంలో గ్రామాల్లో రైతులను చేయి పట్టుకుని నడిపించేలా ఆర్బీకేల ద్వారా పంటల కొనుగోలు జరిగేవి. ఈ–క్రాప్ కింద నమోదు చేసుకున్న ప్రతి రైతుకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా, ఆర్బీకేల్లో పోస్టర్లు కనిపించేవి. గిట్టుబాటు ధరల కంటే తక్కువ రేటుకు ఏ రైతు తన పంటను అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చేది కాదు. ఒకవేళ అలా అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏ రైతుకైనా వస్తే.. ఆ రైతు ఆర్బీకేకి వచ్చి రిజిష్టర్ చేసుకుని, టోల్‌ఫ్రీ నెంబర్ 1907కు ఫోన్ చేస్తే చాలు వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని ఆ రైతుల నుంచి పంటలను కొనుగోలు చేసేది. నాడు ధాన్యం సేకరణకు ప్రభుత్వం రూ.65 వేల కోట్లు ఖర్చు చేసి రైతులకు గిట్టుబాటు ధర ఇప్పించే ప్రయత్నం చేసింది.


నేడు దీనాతి దీనం

నేడు ధాన్యం కొనుగోళ్లలో ఏ రైతుకూ కనీస గిట్టుబాటు ధర రాలేదు. జిల్లాలో లక్షా 41 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇబ్బందులు వచ్చినా సగటున 35 నుంచి 40 బస్తాల వరకూ దిగుబడి వచ్చింది. ఈసారి బయట మార్కెట్‌లో ధరలు చాలా తక్కువ ఉండటంతో రైతులు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అమ్మడానికి ఆసక్తి చూపుతుంటే .. జిల్లాలో ఏర్పాటు చేసిన 156 కొనుగోలు కేంద్రాల్లో నామమాత్రంగానే కొనుగోలు చేశారు. తుపాన్లు, భారీ వర్షాలు దెబ్బతీసినా చాలాచోట్ల ఈసారి అధిక దిగుబడులు వచ్చాయి. అయితే బయట మార్కెట్‌లో దళారులు, వ్యాపారులు, మిల్లర్లు కుమ్మక్కై ధరను దారుణంగా పడేశారు. బస్తాకు గిట్టుబాటు ధర రూ.1740 ఉండగా కనీసం రూ.1300లకు కూడా కొనని పరిస్థితులు ఏర్పడటంతో రైతులు భారీగా నష్టపోయారు.



కొల్లిపర మండలంలో ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో కల్లాల్లోనే ధాన్యాన్ని భద్రపరిచిన రైతులు

ఎకరాకు రూ.1.50 లక్షలు నష్టం



నాలుగు ఎకరాల్లో తేజ రకం మిర్చి పంట సాగు చేశాను. గత ఏడాది ఎకరాకు సుమారు 25 క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. ఈ ఏడాది మిర్చి పంటకు రక రకాల తెగుళ్లు వ్యాపించడంతో పాటు వాతావరణంలో మార్పుల కారణంగా 10 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితులు లేవు. అందులో సగానికి పైగా తాలు వచ్చింది. ఎకరాకు ఇప్పటివరకు విత్తనం మొదలు, పురుగు మందులు, కోత కూలీలు, తొక్కుడు, బాడుగ, కౌలు కలుపుకొని రూ.2.50 లక్షలు వరకు ఖర్చు వచ్చింది. అంటే మొత్తం నాలుగు ఎకరాలకు రూ.10 లక్షల వరకు ఖర్చు వచ్చింది. గత ఏడాది క్వింటా రూ.23 వేలు నుంచి రూ.28 వేలు వరకు పలికిన తేజ రకం ఎరుపు కాయలకు ఈ ఏడాది రూ.9 వేలు నుంచి రూ.10 వేలు పలుకుతోంది. జనవరిలో 25 బస్తాలు గుంటూరు యార్డుకు తీసుకువచ్చాను. క్వింటాకు రూ.13,500 ధర వచ్చింది. మార్చి నెలలో మరో 20 బస్తాలు తీసుకువెళ్తే క్వింటా రూ.9 వేలకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇక తాలు రకం గత ఏడాది క్వింటాకు రూ.16 వేలు ధర ఉంటే ఈ ఏడాది రూ.4,500 వేలు కూడా ధర దక్కడం లేదు. ఈ ఏడాది మొత్తం మీద ఎకరాకు సుమారు రూ.1.50 లక్షల చొప్పున మొత్తం రూ.6 లక్షల వరకు నష్టం రావడం ఖాయం.

– దారం ఎలీసారెడ్డి, దారంవారిపాలెం గ్రామం

క్రాప్ హాలిడే ప్రకటిస్తేనే..



వచ్చే ఏడాది పొగాకు సాగు చెయ్యకుండా క్రాప్ హాలిడే ప్రకటిస్తేనే పొగాకు రైతులకు న్యాయం జరుగుతుంది. గత ఏడాది ధర బాగుంది కదా అని ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకుని నల్ల బర్లీ సాగు చేశాను. తీరా ఇప్పుడు చూస్తే అసలు కొనేవారే లేరు. ఒకవేళ ఎవరన్నా కొనేందుకు ముందుకు వచ్చినా బాగా ధర తగ్గించి అడుగుతున్నారు. అందుచేత వచ్చే ఏడాది క్రాప్ హాలిడే ప్రకటిస్తేనే మేలు జరుగుతుంది.

– కంచర్ల సాల్ బాబు, పొగాకు రైతు, తిమ్మాపురం

ధాన్యం కొనేవారే లేరు



నాకున్న అర ఎకరం సొంత పొలంతో పాటు 5 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వరి పంట పండించాను. కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని కొనేవారు కరువయ్యారు. ఇప్పటికీ ధాన్యం 300 బస్తాల వరకు నిల్వ ఉంది. గత ఏడాది ఖరీఫ్, ఈ ఏడాది ఖరీఫ్‌లో పండించిన ధాన్యం ప్రస్తుతం రూ. 2 వేల నుంచి రూ. 2400 ధర ఉండాల్సి ఉండగా, పాత ధాన్యాన్ని కూడా ఇప్పటికీ దళారులు రూ. 1400కే అడుగుతున్నారు. చివరి గింజ వరకు కొంటామని ప్రభుత్వం చెప్పిన మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. గ్రామాల్లోకి అధికారులు వచ్చి సమావేశాలు నిర్వహించి, ధాన్యం కొనుగోలు చేసిన దాఖలాలు కనిపించలేదు. ధాన్యం ధర ఈ విధంగా పతనమైన రోజులు గతంలో చూడలేదు.

– నాగిశెట్టి రమేష్, కౌలు రైతు, కసుకర్రు

సేవల్లో 'ఫ్లోరెన్స్ నైటింగేల్'

- భారత రాష్ట్రపతి చేతులమీదుగా జాతీయస్థాయి ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు అందుకున్న వలివేటి శుభావతి
- ఉభయ తెలుగు రాష్ట్రాల్నుంచి అవార్డు దక్కించుకున్న ఏకైక మహిళగా గుర్తింపు



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డును స్వీకరిస్తున్న శుభావతి

తెనాలి: పవిత్రమైన వైద్యవృత్తిలో నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తే వృత్తిజీవితంలో సంతృప్తినే కాదు... ఏకంగా రాష్ట్ర, జాతీయ అవార్డులు కూడా వరిస్తాయి. దేశ రాజధాని ఢిల్లీలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా శుక్రవారం జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డును స్వీకరించిన వలివేటి శుభావతి ఇందుకు చక్కని నిదర్శనం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్నుంచి ఈ అవార్డును అందుకున్న ఏకైక మహిళ కూడా శుభావతినే. ఏఎన్ఎం విధుల్లో వైద్యవృత్తి ప్రాధాన్యతను గుర్తెరిగి, అంకితభావంతో నిర్వహిస్తూనే ఉన్నత కోర్సులు చేస్తూ, వరుస పదోన్నతులతో మేనేజ్‌మెంట్ ఇన్‌స్ట్రక్టర్ హోదాకు ఎదిగారు. ఇప్పుడు ఏకంగా జాతీయ అవార్డునే దక్కించుకున్నారు.

సంగం జాగర్లమూడి స్వస్థలం

తెనాలి రూరల్ మండల గ్రామం సంగంజాగర్లమూడి వలివేటి శుభావతి స్వస్థలం. తల్లిదండ్రులు సీతారావమ్మ, సుబ్రహ్మణ్యం. వైద్యరంగంలో తొలిగా ఉమ్మడి గుంటూరు జిల్లా నాదెండ్ల పీహెచ్‌సీ పరిధిలోని చందవరం సబ్‌సెంటర్‌లో ఏఎన్ఎంగా శుభావతి వృత్తిజీవితం ఆరంభమైంది. ఉద్యోగ బాధ్యతల్లో ఉంటూనే పీజీ కోర్సులు చేస్తూ వచ్చారు. 13 ఏళ్ల సర్వీసులో మూడు పీజీలు చేశారు. ఫలితంగా పదోన్నతిపై ఇదే జిల్లాలోని నకిరేకల్‌లో హెల్త్ ఎడ్యుకేటర్‌గా నియమితులయ్యారు. అక్కడ 12 ఏళ్లపాటు పనిచేశారు. కర్నూలులోని రీజినల్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ట్రైనింగ్ సెంటర్ (మేల్)కు మేనేజ్‌మెంట్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తూ గత జనవరిలో ఉద్యోగ విరమణ చేశారు.

పేద రోగులకు సేవలు

వైద్యరంగంలో తన 39 ఏళ్ల సర్వీసులో శుభావతి పేద ప్రజలు, అవసరమైన వారికి తగిన సేవలను అందిస్తూ వచ్చారు. తన సమర్థత, నిబద్ధతను గుర్తించిన ఉన్నతాధికారులు అప్పగించిన అన్ని బాధ్యతలను ఆమె సక్రమంగా నిర్వర్తించారు. అనేక అవార్డులను అందుకున్నారు. నకిరేకల్‌లో ఉండగా, హెచ్ఐవీ ప్రాజెక్టుపై శుభావతిని నాటి కలెక్టర్ ప్రత్యేక శిక్షణకని ఢిల్లీ పంపారు. అదే ప్రాజెక్టుపై జిల్లాలోని ఆర్ఎంపీ/పీఎంపీలతో సహా ప్రభుత్వ యంత్రాంగంలోని అన్ని డిపార్టుమెంటు ఉద్యోగులకు శుభావతి హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. ఆ కృషికి గుర్తింపుగా అప్పటి మంత్రి కొణిజేటి రోశయ్య నుంచి అవార్డును అందుకున్నానని శుభావతి చెప్పారు. నాతోటి సిబ్బంది, ప్రజలు ఎంతో ప్రేమను చూపటం గుర్తుండి పోతుందని అంటారు శుభావతి, 'ఎంతో కష్టపడి పనిచేశాను. అందరి మన్ననలు పొందాను. స్వచ్ఛందంగా బాధ్యతలను నిర్వర్తించాను. ఇప్పుడు జాతీయ అవార్డు లభించిందంటే నా వృత్తి జీవితం మొత్తానికి అందిన గౌరవంగా భావిస్తున్నాను అన్నారు శుభావతి.

ఎన్నో అవార్డులు.. రివార్డులు

ఆకాశవాణి, విజయవాడ కేంద్రం ఆహ్వానంపై బాల్య వివాహాలు, మాతాశిశు మరణాలు, బాలికా శిశు సంరక్షణ వంటి కార్యక్రమాలపై ప్రత్యేక ప్రసంగాలు చేశారు. గుంటూరు జిల్లాలో బాల్య వివాహాల నిరోధంపై రిసోర్స్ పర్సన్‌గానూ వ్యవహరించారు. దీనిపై పలు పాటలు రాసి, స్వయంగా గానం చేశారు. అప్పట్లో నెల్లూరు జిల్లా కలెక్టర్లనుంచి అవార్డులను అందుకున్నారు. 2014 ఎన్నికల్లో నెల్లూరు జిల్లా కలెక్టర్ సూచనపై ఓటరు అవగాహనపై పాట రాశారు. చెన్నైలో సినీ సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్‌తో స్వరకల్పన చేయించారు. ఈ సందర్భంగా నాటి కలెక్టర్ రేఖారాణి ప్రశంసాపత్రం అందించారు. రక్తహీనతపై అవగాహన కోసం పాట రాశారు. శ్రీకాకుళంలో కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ నిర్వహించిన సేవలకు అవార్డులు దక్కాయి. గత ప్రభుత్వ హయాంలో శానిటేషన్, న్యూట్రిషన్‌పై శుభావతి రాసిన పాట పాపులరైంది. ప్రతి అర్బన్ హెల్త్ సెంటర్‌లోనూ ఏఎన్ఎంల పుస్తకంలో తొలి పేజీలోనే ఆ పాటను ముద్రింపజేశారు. ఏపీ కల్చరల్ అవేర్‌నెస్ రాష్ట్రస్థాయి ఉత్తమ పౌరురాలి అవార్డు, శ్రీకాకుళంలో ఆంధ్రరత్న అవార్డు వంటివెన్నో తనకు అలంకారాలుగా మారాయి. భర్త ప్రైవేటు ఉద్యోగి, ఏకైక కుమారుడు హైదరాబాద్‌లోని ప్రముఖ కార్పొరేట్ హాస్పటల్‌లో పని చేస్తున్నారు. రిటైరయ్యాక సొంత జిల్లా గుంటూరులోనే స్థిరపడ్డారు.



వలివేటి శుభావతి

కూటమి ప్రభుత్వ మోసాలను గుర్తించిన ప్రజలు

- వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ జిల్లా పరిశీలకుడు పోతిన మహేష్
- జూన్ 4న జరిగే వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలి
- మంగళగిరి నియోజకవర్గ సమావేశంలో పాల్గొన్న పార్టీ నేతలు



మాట్లాడుతున్న పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు పోతిన మహేష్, వేదికపై అంబటి రాంబాబు

మంగళగిరి: కూటమి ప్రభుత్వం అధికారం కోసం ఎన్నో హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిందని, ఆ విషయాన్ని ప్రజలు ఇప్పటికే గుర్తించారని వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ జిల్లా పరిశీలకుడు పోతిన మహేష్ అన్నారు. జూన్ 4వ తేదిన జరగనున్న వెన్ను పోటు దినాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. మహేష్ మాట్లాడుతూ ప్రజలను మభ్య పెట్టడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలను ప్రజలు నమ్మడం లేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలనే కాక ఇవ్వని హామీలను కూడా నెరవేర్చారని, దీనిని ప్రజలు గుర్తించారని, కూటమి ప్రభుత్వాన్ని సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పవన్ కల్యాణ్ పార్టీ కార్యాలయం 15 ఎకరాలలో ఉందని, కొత్త ఇంటిని కోట్లాది రూపాయలతో నిర్మిస్తున్న చంద్రబాబు ఎన్ని ఎకరాలలో ఇళ్లు కడుతున్నారని ప్రశ్నించారు. చేతిలో మీడియా ఉందని దుష్ప్రచారం చేస్తే ప్రజలు నమ్మే రోజులు పోయాయని గుర్తించుకోవాలని హితవు పలికారు.

ప్రజలు తిరగబడే రోజులు దగ్గరకు వచ్చాయి

ప్రజలకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చని టీడీపీ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకే వెన్నుపోటు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, నియోజకవర్గం నుంచి ప్రజలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలంతా వెన్నుపోటు దినోత్సవంలో పాల్గొని తెలియజేయాలని కోరారు. పార్టీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ జూన్ 4వ తేదీన జరగనున్న వెన్నుపోటు దినోత్సవంలో నియోజకవర్గం నుంచి ప్రజలు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ప్రజలను చేసిన మోసాల్ని ఎండగట్టడమే వెన్నుపోటు దినోత్సవ లక్ష్యమన్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వాన్ని నమ్మి రాష్ట్ర ప్రజలంతా మోసపోయారన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఒక్కటీ నెరవేర్చని కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీయాలన్నారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చకుండా ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. సమావేశంలో గుంటూరు తూర్పు, పొన్నూరు, తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గాల సమన్వయకర్తలు నూరి ఫాతిమా, అంబటి మురళీకృష్ణ, వనమా బాల వజ్రబాబు, బలసాని కిరణ్ కుమార్, రాష్ట్ర ప్రచార విభాగం ఉపాధ్యక్షుడు బొమ్ము తాతిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు పచ్చల రత్నకుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ దామర్ల కుబేరస్వామి, జిల్లా యాక్టివిటీ కార్యదర్శి మల్లవరపు సుధారాణి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు ఊట్ల పాలశ్రీనివాసరావు, ఆప్కో మాజీ చైర్మన్ చిల్లపల్లి మోహనరావు, మంగళగిరి మండల, పట్టణ అధ్యక్షులు నాలి వెంకటకృష్ణ, ఆకురాతి రాజేష్, తాడేపల్లి పట్టణ, రూరల్, దుగ్గిరాల మండల అధ్యక్షులు బుర్రముక్క వేణుగోపాలస్వామి రెడ్డి, అమరా నాగయ్య, తాడిబోయిన శివగోపయ్య, పట్టణ అధ్యక్షురాలు సంకె సునీత, నియోజకవర్గ ప్రతినిధి కాశినీడు బాజి గంగాధర్, జిల్లా సెక్రటరీ అహ్మద్ బాజీ సాహిద్, దివ్యాంగుల అధ్యక్షుడు బొక్కా అగస్టీన్, ఎస్టీ అధ్యక్షుడు మేడా వెంకటేశ్వరరావు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 2,000 గరిష్టం : రూ. 3,200

మోడల్ ధర రూ. 5,000



పసుపు ధరలు
(శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 847

కొమ్ములు : 729 బస్తాలు

కనిష్ట :	గరిష్ట : (ధర రూ॥ల్లో)	మోడల్ :
9,650	10,750	10,500

కాయలు : 118 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,650	10,600	10,500

మొత్తం అమ్మకాలు : 635.250 క్వింటాళ్లు

–దుగ్గిరాల

క్లుప్తంగా

పోలీసులపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్

తెనాలి రూరల్: లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నిరాటంకంగా అమలు చేస్తూ దళిత, మైనార్టీ యువకులపై విచక్షణారహితంగా దాడి చేసిన సీఐలు, ఇతర పోలీసు సిబ్బందిపై క్రిమినల్ కేసులు పెట్టాలని కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ, షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి అందే శ్యాం డిమాండ్ చేశారు. తెనాలి ఐతానగర్‌లో బాధిత కుటుంబాలను పరామర్శించిన అనంతరం వారు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఐతానగర్ దళితులు క్రిమినల్, గంజాయి కేసుల్లో ఉన్నందున పోలీసులు బహిరంగంగా ట్రీట్మెంట్ ఇవ్వడం సరైందేనని అధికార పార్టీ తనకు మడుగులొత్తే మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేయించారని ఆరోపించారు. బాధ్యులైన పోలీసులపై క్రిమినల్ కేసుల నమోదుతోపాటు విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

కూటమి ప్రభుత్వంపై

ఏడాదిలోనే ప్రజావ్యతిరేకత

- జూన్ 4న 'వెన్నుపోటు దినం'లో ప్రజలకు చేసిన మోసం బహిర్గతం చేయాలి
- నియోజకవర్గ ముఖ్యనేతల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు



వెన్నుపోటు దినం పోస్టరు ఆవిష్కరించిన జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, పక్కన శివకుమార్, మహేష్ తదితరులు

తెనాలి: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంపై ఏడాదికాలంలోనే వ్యతిరేకత పెరుగుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన సంక్షేమం కన్నా అధికంగా ఇస్తామని చంద్రబాబు నాయుడు హామీనిచ్చారని, పవన్‌కల్యాణ్ భరోసానిచ్చారని గుర్తుచేశారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ఏమీ చేయలేదన్న భావనకు ప్రజలు వచ్చారని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాన్నీ, హామీలనిచ్చి మోసగించిన తప్పిదాన్ని ప్రతిపక్ష పార్టీగా వైఎస్సార్ సీపీ బహిర్గతం చేయాల్సి ఉందన్నారు. ఇందుకోసం పార్టీ పిలుపు మేరకు జూన్ 4న 'వెన్నుపోటు దినం'ను విజయవంతం చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో జూన్ 4న జరగనున్న 'వెన్నుపోటు దినం' కార్యక్రమంపై శుక్రవారం సాయంత్రం స్థానిక గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటైన పార్టీ ముఖ్యనేతల సమావేశానికి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అధ్యక్షత వహించారు. 'వెన్నుపోటు దినం' పోస్టరును ఆవిష్కరించిన జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో 184 హామీలను ఇచ్చారనీ, పైగా ఇంకా సూపర్ సిక్స్ ఉన్నాయని గుర్తుచేశారు. 'బాబు ష్యూరిటీ–భవిష్యత్‌కు గ్యారెంటీ' అన్నారని చెప్పారు. ఏ పథకాన్నీ అమలు చేయలేదని చెబుతూ అదేమంటే రూ.4 వేల పింఛను ఇస్తున్నామని వారే చెబుతున్నారని రాంబాబు అన్నారు. గ్యాస్‌బండకు డబ్బులు ఇచ్చామంటున్నా 1.49 కోట్ల కనెక్షన్లు ఉంటే 30–40 వేలకు మించి ఇవ్వలేదన్నారు. కార్యకర్తల నుండి పెద్ద నాయకుల వరకు అందరిపైనా కేసులు పెట్టటం, జైళ్లకు పంపటం, బెయిలు రాకుండా చేస్తూ భయపెట్టాలని చూడటం మినహా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే ఉద్దేశం ప్రభుత్వానికి లేదన్నారు. చంద్రబాబునాయుడు గతంలో ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిస్తే, ఇప్పుడు మరో రెండు పార్టీలతో కలిసి ప్రజలకు వెన్నుపోటు పొడిచారని వ్యాఖ్యానించారు. అమ్మ ఒడికి పేరు మార్చి తల్లికి వందనం పేరుతో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఏటా రూ.15 వేలు ఇస్తామన్నారని, రైతుభరోసా కూడా లేదన్నారు. ఏ పంటకూ గిట్టుబాటు ధరలు లేవన్నారు.

విజయవంతానికి కార్యాచరణ

మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ తెనాలిలో జూన్ 4న ఉదయం 10 గంటలకు మార్కెట్ సెంటర్ నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు వెన్నుపోటు దినం నిరసన ప్రదర్శన జరుగుతుందని చెప్పారు. విజయవంతానికి కార్యాచరణను రూపొందిస్తున్నామని తెలిపారు. పార్టీ గుంటూరు పార్లమెంటు పరిశీలకుడు పోతిన మహేష్ మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పాలనలో ఏవిధంగా మోసపోయామన్న భావన ప్రజల్లో ఉందని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎటువంటి లబ్ధి కలిగిందీ, ఎలా జీవన ప్రమాణాలు పెరిగాయి? చంద్రబాబు హామీలను అమలుచేయకుండా ఏవిధంగా మోసం చేసిందీ స్పష్టంగా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అత్తోట నాగవేణి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లిముంత పోతురాజు, గుంటూరు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు గెడ్డటి సురేంద్ర, అధికార ప్రతినిధి కొడాలి క్రాంతి, తెనాలి పట్టణ, రూరల్ మండల, కొల్లిపర మండలాల అధ్యక్షులు దేసు శ్రీనివాసరావు, చెన్నుబోయిన శ్రీనివాసరావు, కల్లం వెంకటప్పారెడ్డి, కొర్ర యశోద, మైనారిటీ విభాగం అధ్యక్షుడు షేక్ దుబాయ్‌బాబు మాట్లాడారు. ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, పార్టీ సీనియర్ నేతలు మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, తాడిబోయిన రమేష్, జొన్నల శివారెడ్డి, బొంతు నరేంద్రరెడ్డి, బూరెల దుర్గాప్రసాద్, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల ఉత్తేజ్‌రెడ్డి, ఈద యశ్వంత్‌రెడ్డి, కుర్రా జస్వంత్, బండ్లమూడి నాని, తదితరులు పాల్గొన్నారు. అక్కిదాసు కిరణ్ స్వాగతం పలికారు. ఆయా కమిటీల పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చేతుల్లోనే పిల్లల ఆరోగ్యం

- ఏసీజీ డైరెక్టర్ జయలక్ష్మి
- అండర్–16 టెన్నిస్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న జయలక్ష్మి

గుంటూరు వెస్ట్ (క్రీడలు): పిల్లలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలంటే క్రీడా సాధన ఎంతో కీలకమని ఏసీబీ డైరెక్టర్ ఆర్.జయలక్ష్మి తెలిపారు. ఇది పూర్తిగా తల్లిదండ్రుల చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బీఆర్ స్టేడియం సింథటిక్ కోర్టులో అండర్–16 ఓపెన్ బాలబాలికల టెన్నిస్ పోటీలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జయలక్ష్మి మాట్లాడుతూ కొందరు తల్లిదండ్రులు చదువులకిచ్చే ప్రాధాన్యత పిల్లల ఆరోగ్యానికి ఇవ్వడం లేదన్నారు. దీంతో పిల్లల్లో అధిక శాతం ఊబకాయ సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. జంక్ ఫుడ్‌తోపాటు మొబైల్స్, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ వీలైనంత వరకు వారికి దూరంగా ఉంచాలని సూచించారు. టెన్నిస్ విలువ తెలిసిన సీనియర్ ఆటగాడు ఎస్.రామకృష్ణ ఈ టోర్నమెంట్‌ను స్పాన్సర్ చేయడం అభినందనీయం అన్నారు. పోటీల నిర్వాహకుడు షేక్ అహ్మద్ మాట్లాడుతూ పోటీలు మూడు రోజుల పాటు జరుగుతాయన్నారు. మొత్తం 36 మంది చిన్నారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. అనంతరం పోటీలను జయలక్ష్మి,, రామకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో చీఫ్ కన్సర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ బీఎస్ఎన్ మూర్తి, రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ పి.శామ్యూల్ జొనాథన్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి, ఎన్.సాంబశివరావు, జీవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స



చికిత్స వివరాలు వెల్లడిస్తున్న సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ రమణ, కిరణ్‌కుమార్ తదితరులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స చేసి వృద్ధుడి ప్రాణాలు కాపాడినట్లు జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. శుక్రవారం జీజీహెచ్ జనరల్ సర్జరీ విభాగంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం మాదారం గ్రామానికి చెందిన పాలిపోగు ప్రసాద్ (62) రెండు నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. తీవ్రమైన కడుపు నొప్పి, కామెర్లు, చలిజ్వరం రావడంతో ఒంగోలులో 25 రోజులు చికిత్స తర్వాత గుంటూరు జీజీహెచ్‌కు వచ్చాడు. హైడాటిడ్ సిస్ట్ వ్యాధి (కాలేయంలో నీటిబుడ్డ)తో బాధపడుతున్నట్లు నిర్ధారించామన్నారు. కుక్కల వల్ల, కలుషిత నీటిని తాగడం వల్ల వ్యాధి వస్తుందన్నారు. కొన్నిసార్లు మాంసం పూర్తిగా ఉడకకుండా తినడం వల్ల కూడా వస్తుందని చెప్పారు. ప్రసాద్ కాలేయం, ఇతర అవయవాలకు ఇబ్బంది ఉండటంతో సర్జరీ చేశామని, దీనికి నాలుగు గంటల సమయం పట్టిందన్నారు. సుమారు 40 రోజులపాటు వార్డులో చికిత్స అందించి డిశ్చార్జి చేశామన్నారు. సుమారు రూ.10 లక్షల ఖరీదైన ఆపరేషన్‌ను ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా ఉచితంగా చేశామని తెలిపారు. ఆపరేషన్ ప్రక్రియలో వైద్యులు నాగ సంతోష్‌కుమార్, సాదిక్ బాషా, వేణుగోపాల్, మేఘన, అవిన్, హరి, పోలయ్య, శ్యాంసన్, శ్వేత, ప్రసాద్, హనుమంతరావు, నర్సింగ్ సిబ్బంది రాజ్యలక్ష్మి, స్రవంతి, అనిత, ఉష, నంద పాల్గొన్నట్లు వెల్లడించారు. వృద్ధుడి ప్రాణాలు కాపాడిన వైద్య బృందాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ అభినందించారు.

తోడికోడళ్లకు మంత్రి మనోహర్ నివాళి



కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మంత్రి

తెనాలిరూరల్: బాపట్ల జిల్లా కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన తోడికోడళ్లు మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. కన్నెగంటి సూర్యకుమారి, కన్నెగంటి సరస్వతి కుమారి, కన్నెగంటి ఝాన్సీరాణిల మృతదేహాలు శుక్రవారం సాయంత్రం తెనాలికి చేరుకున్నాయి. నందులపేటలోని కవిరాజ పార్కు రోడ్డులో అక్షరగీత విద్యానికేతన్ వద్ద బంధువుల సందర్శనార్థం మృతదేహాలను ఉంచారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మృతదేహాలకు నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు.

పొగాకు.. ఆరోగ్యానికి చేటు

- నేడు నో టుబాకో డే
- బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధం
- పొగాకు వినియోగంతో అనేక నష్టాలు

గుంటూరు మెడికల్: యవ్వనంలో సరదా కోసం మొదలుపెట్టే ధూమపానం చివరకు ప్రాణాలనే హరిస్తుంది. సిగరెట్, బీడీ, చుట్ట తాగే అలవాటు వ్యసనంలా మారి మనిషిని బానిసను చేసుకుంటుంది. స్మోకింగ్, పొగాకు ఉత్పత్తుల మోజులో పడి యువత భవిష్యత్తును అంధకారం చేసుకుంటోంది. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులలో 40 శాతం మంది పొగతాగటం, పొగాకు ఉత్పత్తులు వాడటం ద్వారానే వ్యాధి బారిన పడి మరణిస్తున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. ధూమపానంతో కలిగే అనర్థాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని ప్రపంచ వ్యాప్తంగా మే 31వ తేదీన నో టుబాకో డేను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.

జిల్లాలో బాధితులు అధికమే...

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ గణాంకాల ప్రకారం 35 శాతం మంది యువత ధూమపానం చేస్తున్నారు. వివిధ రోగాలతో 30 – 39 ఏళ్ల వయస్సు వారిలో చనిపోతున్న ప్రతి ఐదుగిరిలో ఒకరు పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్లేనని తేలింది. గుంటూరు జీజీహెచ్‌లో ప్రతి నెలా 1,200 మంది పురుషులు, 2 వేల మంది మహిళలు వివిధ రకాల క్యాన్సర్‌లతో చికిత్స పొందుతున్నారు. వీరిలో 40 శాతం మంది కేవలం పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల క్యాన్సర్ బారిన పడ్డారు. జిల్లాలో క్యాన్సర్ రోగులకు వైద్యసేవలు అందించేందుకు 15 ఆస్పత్రులు, క్లీనిక్‌లు ఉన్నాయి. వీటిల్లో రోజూ 400 మంది వరకు క్యాన్సర్ చికిత్స పొందుతున్నారు.

చట్టం ఏం చెబుతోందంటే..


బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధిస్తూ ప్రభుత్వం చట్టం చేసింది. ఈ చట్ట ప్రకారం రైల్వే స్టేషన్‌లు, సినిమా హాల్స్, బస్ స్టేషన్‌లు, జనసంచారం ఉండే మార్కెట్‌లు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రాంతాల్లో ధూమపానం చేయకూడదు. ముఖ్యంగా పాఠశాలలు, గుడులకు సమీపంలో పొగాకు ఉత్పత్తులు అమ్మటం చట్టరీత్యా నేరం. 18 ఏళ్లలోపు పిల్లలకు పొగాకు ఉత్పత్తులు చట్టరీత్యా విక్రయించకూడదు. చట్టాన్ని అతిక్రమించిన వారికి జరిమానా విధిస్తారు. ప్రత్యేకంగా స్మోకింగ్ జోన్ ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల్లో మాత్రమే ధూమపానం చేసేందుకు అనుమతించాలి.



పొగాకు అలవాటు మానేయాలనుకునే వారికి ఔషధాలు

జీజీహెచ్‌లో ఉచిత కౌన్సెలింగ్

గుంటూరు జీజీహెచ్ మానసిక వ్యాధుల వైద్య విభాగంలో పొగాకు ఉత్పత్తుల అలవాటు మానేయాలనుకునే వారికి ఉచితంగా కౌన్సెలింగ్ చేసి, ఔషధాలు ఇస్తున్నారు. 2019 నుంచి డీ అడిక్షన్ సెంటర్‌లో చికిత్స అందిస్తున్నారు. గత ఏడాది 1,263 మందికి చికిత్స అందించడం ద్వారా కొంత మంది స్మోకింగ్ అలవాటు మానేశారు. స్మోకింగ్ అలవాటు ఉన్నవారికి ఛాతీ ముందు భాగంలో, భుజానికి, తొడకు.. ఇలా ఏదైనా ఒక ప్రదేశంలో వెంట్రుకలు లేని చోట నికోటిన్ ట్రాన్స్‌థర్మల్ ప్యాచ్‌ను అంటిస్తారు. ఈ ప్యాచ్ అంటించి కౌన్సెలింగ్ చేయడం ద్వారా ప్రతి నెలా పది మందికి పైగా పొగాకు వినియోగాన్ని పూర్తిగా మానివేస్తున్నట్లు గుర్తించామని సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ వడ్డాది వెంకట కిరణ్ తెలిపారు.



నో టుబాకో డే పోస్టర్

పొగాకు వినియోగంతో క్యాన్సర్



క్యాన్సర్ చికిత్స కోసం వచ్చే వారిలో 40 శాతం మంది పొగాకు, దాని ఉత్పత్తుల వాడకం వల్ల క్యాన్సర్‌కు గురవుతున్నవారే. పొగతాగటం, పొగాకు ఉత్పత్తులైన ఖైనీ, గుట్కా, పాన్‌పరాగ్ వంటి వాటిని వినియోగించటం వల్ల నోరు, గొంతు, అన్నవాహిక, ఊపిరితిత్తులు, జీర్ణాశయం, మూత్రాశయ క్యాన్సర్‌ల బారిన పడుతున్నారు. ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు నేడు ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. చికిత్స తీసుకుని త్వరితగతిన వ్యాధి నుంచి కోలుకోవచ్చు.

– డాక్టర్ ఎం.జి.నాగకిషోర్, సీనియర్ సర్జికల్ అంకాలజిస్ట్, గుంటూరు

ధూమపానంతో గుండెజబ్బులు



పొగతాగే వారిలో రక్తపోటు, గుండెపోటు, పక్షవాతం వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. పొగాకులో 400 రకాల విషపదార్థాలు ఉంటాయి. కార్బన్ మోనాక్సైడ్ వల్ల గుండెపోటు, టార్ వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్ వస్తుంది. నపుంసకత్వం, పక్షవాతం పొగరాయుళ్లను వదలవు. పొగతాగే వారికి చుట్టుపక్కల ఉన్నవారిపై కూడా పొగాకు ప్రభావం ఉంటుంది. గుండె జబ్బులతో బాధపడుతూ వైద్యం కోసం వచ్చే వారిలో 70 శాతం మంది ధూమపానం చేసేవారే.

– డాక్టర్ బొర్రా విజయ్‌చైతన్య, ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్ట్, గుంటూరు జీజీహెచ్

వైఎస్సార్ సీపీలో పదవుల నియామకం

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురుని పలు పదవుల్లో నియమిస్తూ.. ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుండి ఉత్తర్వులు జారీ అయ్యాయి. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం జోనల్ అధ్యక్షుడిగా తాడికొండ నియోజకవర్గానికి చెందిన కళ్లం హరికృష్ణారెడ్డిని, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శిగా గుంటూరు తూర్పు నియోజకవర్గానికి చెందిన వేలూరి అనిల్‌రెడ్డి, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మంగళగిరి నియోజకవర్గానికి చెందిన గంజి షణ్ముఖ్ (నాని)లను నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి.

ప్రధానోపాధ్యాయులకు ఉద్యోగోన్నతి ధ్రువపత్రాలు అందజేత



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జెడ్పీ, మున్సిపల్, నగరపాలకసంస్థ పాఠశాలల్లో ఉద్యోగోన్నతులపై నియమితులైన ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక ధ్రువపత్రాలు అందజేశారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి జనరేట్ అయిన ఉద్యోగోన్నతుల ధ్రువపత్రాలను హెచ్‌ఎంలకు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ హెచ్‌ఎం ఏ.తిరుమలేష్, హెచ్‌ఎంగా ఉద్యోగోన్నతి పొందిన షేక్ మొహమ్మద్ ఖాసిం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

చెరుకుపల్లి: లారీ, బొలెరో వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. మోరవాగుపాలెం నుంచి చందోలు వైపు లారీ వస్తోంది. అదే సమయంలో మచిలీపట్నం నుంచి నెల్లూరు వైపునకు వెళ్తున్న బొలెరో చందోలు ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్ సమీపంలోకి వచ్చింది. రెండూ ఎదురెదురుగా ఢీకొన్నాయి. బొలెరోలో ఉన్న డ్రైవర్ దుర్గారావుకు తీవ్రగాయాలు అయ్యాయి. క్లీనర్ చంద్రమౌళి స్వల్పగాయాలతో బయటపడ్డారు.

ఎమ్మెల్సీ కార్యాలయంలో కారు చోరీ చేసిన దొంగ అరెస్టు

వివరాలు వెల్లడించిన వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్



దొంగను అరెస్ట్ చేసిన వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్, పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు

లక్ష్మీపురం: ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కార్యాలయంలో కారు చోరీ చేసి పరారైన ఘటనలో వ్యక్తిని అరెస్ట్ చేసి కారును స్వాధీనం చేసుకున్నట్టు వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్ తెలిపారు. వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్ శుక్రవారం రాత్రి తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల 28వ తేదీన కడప జిల్లా కలసపాడు మండలం ఎగువ రామాపురం గ్రామానికి చెందిన పనకనపల్లి రాంప్రసాద్ రెడ్డి 2009–2014 వరకు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు చెందిన ఎన్ఆర్ఐ అగ్రిటెక్ కార్యాలయంలో డ్రైవర్‌గా పనిచేశాడు. అక్కడ నుంచి హైదరాబాద్‌లో ఓలా క్యాబ్, అలాగే మరి కొన్ని చోట్ల డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగించాడు. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేని కారణంగా మరలా తిరిగి ఆలపాటి రాజేంద్రప్రసాద్ వద్ద పనిచేసేందుకు ఈనెల 28వ తేదీన గుంటూరు విద్యానగర్‌లోని రాజేంద్రప్రసాద్‌కు చెందిన ఎన్ఆర్ఐ అగ్రిటెక్ సంస్థకు చెందిన వైస్ చైర్మన్ సాంబశివరావు వద్దకు వచ్చి పని కావాలని అడిగాడు. ప్రస్తుతం పనిలేదని ఆయన చెప్పాడు. కొద్ది రోజుల తరువాత చూద్దాం అని చెప్పడంతో కడప నుంచి వచ్చానని, రెండు రోజుల ఇక్కడే ఉండి వెళ్తానని చెప్పాడు. గతంలో ఉన్న పరిచయాల వల్ల ఆఫీస్ వద్దనే ఉన్నాడు. అయితే అదే రోజు రాత్రి 9 గంటల సమయంలో ఆలపాటి రాజేంద్రప్రసాద్ డ్రైవర్‌గా పనిచేసే సంతవరపు నాగార్జున ఏపీ 07జెడ్ 2137 నంబర్ గల కారును కార్యాలయం వద్ద పార్కింగ్ ప్రదేశంలో పెట్టి తాళాలు కార్యాలయంలో పెట్టి వాచ్‌మెన్‌కు చెప్పి వెళ్లిపోయాడు. తరువాత రాత్రి ఒంటి గంట సమయంలో హైదరాబాద్ ఉన్న రాంప్రసాద్‌రెడ్డి కారును, వాచ్‌మన్ సెల్‌ఫోన్‌ను చోరీ చేసి పరారైయ్యాడు. దీంతో కారు డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్, సీఐ గంగా వెంకటేశ్వర్లు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్న నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు గుజ్జనగుండ్ల సెంటర్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న క్రమంలో చోరీ చేసిను కారులో ఉన్న రాంప్రసాద్‌రెడ్డి కారును ఆపి పారిపోయే ప్రయత్నం చేస్తున్న క్రమంలో పోలీసులు రాంప్రసాద్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని కారును స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. హైదరాబాద్‌లోని అబ్దుల్లాపూర్ మెట్‌లో ఉన్న ప్రియురాలిని కలసి, కారు తిరిగిద్దామని వస్తున్న సమయంలో పోలీసులు పట్టుకున్నట్లు అంగీకరించాడు. పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు, క్రైం సిబ్బంది ఆంజనేయులు, ప్రసాదరావు, శ్రీనివాసరావును జిల్లా ఎస్పీ అభినందించారు.

ప్రకృతి వనరులను కాపాడుకోవాలి

జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ

గుంటూరు వెస్ట్: ప్రకృతి పంచిన అరుదైన వనరులను మనం జాగ్రత్తగా కాపాడుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన చిత్తడి నేలల పరిరక్షణ కమిటీ సమావేశంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ వన్యప్రాణి చట్టం 1972 ప్రకారం జిల్లాలోని ఉప్పలపాడు పక్షుల కేంద్రాన్ని కన్జర్వేటివ్ రిజర్వ్‌గానూ, మేడికొండూరు మండలం, సిరిపురం గ్రామంలోని మంచినీటి చెరువును చిత్తడి నేలగానూ మార్గదర్శకాల ప్రకారం ప్రతిపాదనలు పంపామన్నారు. వీటిని గ్రామ సభల ద్వారానూ సంబంధిత శాఖాధికారుల ద్వారా ఆమోదం లభించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపాల్సి ఉందని తెలిపారు. సమావేశంలో డీపీఓ సాయి కుమార్, పశుసంవర్ధక శాఖ జేడీఏ సత్యనారాయణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ నజీమా బేగం, అధికారులు పాల్గొన్నారు.

10 మండలాల్లో వర్షం

మేడికొండూరులో 34.4 మి.మీ వర్షం

కొరిటిపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల గుంటూరు జిల్లాలోని 10 మండలాల్లో వర్షం పడింది. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు అత్యధికంగా మేడికొండూరు మండలంలో 34.4 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా ఫిరంగిపురం మండలంలో 2.4 మి.మీ వర్షం పడింది. సగటున 6.6 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. మంగళగిరి మండలంలో 29.8 మి.మీ., తాడికొండ 12.8, తాడేపల్లి 11.4, గుంటూరు పశ్చిమ 8.2, తుళ్ళూరు 6.2, కొల్లిపర 5.2, పెదకాకాని 4.6, గుంటూరు తూర్పులో 4.2 మి.మీ వర్షం పడింది. మే నెల 30వ తేదీ వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 60.2 మి.మీ పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 195.7 మి.మీ వర్షపాతం నమోదైంది.